క్లుప్తంగా

ప్రతి ప్రాణిలో దైవాన్ని గుర్తించాలి



సాయిబాబా జీవనం గురించి వివరిస్తున్న జ్యోతిరాజ్

మార్కాపురం: ప్రతి ప్రాణిలో దైవాన్ని చూడాలని బి. జ్యోతిరాజ్ అన్నారు. గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీ షిరిడీసాయి బాబా ఆలయం నెహ్రూ బజారులో శనివారం రెండో రోజు బాబా సూక్తుల ప్రవచనం జరిగింది. బాబా అతి నిరాడంబర జీవితం గడిపారని, కౌపీనం, భిక్షపాత్ర, రేకు డబ్బా, సటకా మాత్రమే ఉండేవని.. రోజూ భిక్షాటన చేసి తాను తిని.. వచ్చిన భక్తులు, జంతువులు, పక్షులకు అందించేవారని తెలిపారు. నిత్య దీపారాధన, ధునికి కట్టెలు ఉపయోగించేవారని, గోనెపట్టలపై నిదురించేవారని తెలిపారు. ప్రముఖ సాయి ఉపాసకులు సాయి దాసు శ్రీశైలం, మందిర అధ్యక్ష, కోశాధికారులు గోపాలుని హరిహరరావు, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామడుగు గోపి, కోశాధికారి నాగరాజు, అదనపు కార్యదర్శిచల్లా పవన్, కమిటీ సభ్యులు సూరె నాగేశ్వరరావు, విజయ్, మధు, వెంకటేశ్వరరెడ్డి, కరీం, మోహన్, మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటి కుంకుమార్చన



కుంకుమ పూజల్లో మహిళ భక్తులు

పొదిలి: స్థానిక శ్రీ శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం పదహారో రోజుకు చేరాయి. ఉభయదాతలను మేళతాళాలతో ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం కోటి కుంకుమార్చన పూజలు జరిగాయి. అమ్మవారి అనుగ్రహంతో లోక కల్యాణార్థం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, మురళీ కృష్ణమాచార్యులు చెప్పారు. శ్రీవేంకటేశ్వరస్వామికి ఏకాంత సేవలు జరిగాయి. నిర్వాహకులు యక్కలి శేషగిరిరావు, మేడా నరసింహారావు, మల్లయ్య, సాయి, పొనుగుపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న సుభాషిణి

పొదిలి: మిషన్ శక్తి భారత్ న్యాయ సంహితకు సంబంధించి కొత్త చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి చెప్పారు. శనివారం బాపిస్ట్ పాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, పొదుపు గ్రూపు మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. సీడీపీఓ సుధమారుతి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష, భారతీయ శ్రద్ధా సంరక్ష చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ చట్టాల ద్వారా మహిళా సాధికారత, మహిళల భద్రత చేకూరుతుందన్నారు. ఆయా చట్టాలు ఎలా ఉపయోగపడతాయో వివరించారు. సూపర్‌వైజర్లు సావిత్రి, ఝాన్సీరాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ గుర్తించండి



మాట్లాడుతున్న సోమశేఖర బ్రహ్మానందం, పక్కన హెచ్‌ఎంలు

మార్కాపురం: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభకు తగిన ప్రోత్సాహం ద్వారా గ్లోబల్ సిటిజన్స్‌గా అభివృద్ధి చెందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోర్స్ స్టేట్ అబ్జర్వర్ ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ యం. సోమశేఖర బ్రహ్మానందం అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన టీచ్ టూల్ ట్రైనింగ్ 6వ రోజు శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులను ఆకట్టుకుని వారి జీవితాలకు మంచి బాటలు వేయాలని తెలిపారు. హెచ్‌ఎం, కోర్సు డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ప్రతి విద్యార్థుల్లోని సృజనాత్మకతను, నైపుణ్యాలను ఉపాధ్యాయులు గుర్తించేందుకు మంచి అవకాశమన్నారు. రిసోర్స్ పర్సన్స్ సీహెచ్ శ్రీనివాసులు, పి. వెంకటేశ్వర్లు, ఏ. శ్రీనివాసులు, నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకారంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామివారు



స్వామివారి కల్యాణ తాళిబొట్లు చూపుతున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ పి. కేశవరావు, ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపలో పాల్గొన్న సంస్థ కార్యవర్గ సభ్యులు

పొదిలి: దర్శి రోడ్డులోని శ్రీపతినగర్‌లో గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు స్కూల్ నిర్మాణానికి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన చేశారు. స్థానికంగా నివాసం ఉండే పిల్లలు స్కూలుకు వెళ్ళకుండా... చిత్తు కాగితాలు ఏరుకునేందుకు వెళ్ళటం, భిక్షాటన చేస్తుండటాన్ని గమనించిన సంస్థ సభ్యులు సమస్యను పులివెలుగుల సుబ్బారావు.. ఎంఈఓ ఎంఈఓ శ్రీనివాస రెడ్డి, డీఈఓ దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయుల నియామకానికి హామీ పొందినట్లు సభ్యులు చెప్పారు. దీంతో స్పందించిన సంస్థ సభ్యులు, మరి కొందరి దాతల విరాళాల సహకారంతో స్కూల్ నిర్మాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. త్వరతగతిన స్కూల్ ఏర్పాటు చేసి, పిల్లలందరికీ విద్యను అభ్యసించేందుకు సౌకర్యం కలిగిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. దీంతో ఎంఈఓ మామిళ్ళపల్లి శ్రీనివాస రెడ్డి, రెండో ఎంఈఓ పి.నాగలక్ష్మి, మానవత సంస్థ డైరెక్టర్ కాటూరి నారాయణబాబు, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.యల్లమందారెడ్డి, పొదిలి మండల అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వర రావు, కార్యదర్శి బండి అశోక్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అవులూరి యల్లమంద, పులివెలుగుల సుబ్బారావు, సీఆర్పీలు కుమార్, సుబ్బారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో రాజకీయ ప్రమేయం లేదు



సమావేశంలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అభివృద్ధి విషయంలో రాజకీయ ప్రమేయం లేకుండా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పాముల వెంకట సుబ్బయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ తీర్మానంలోని అంశాలను పరిశీలించారు. నగర పంచాయతీ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా ప్రయత్నిద్దామన్నారు. ఎన్నికలకు ముందు మాత్రమే పార్టీల విషయాలపై చర్చించుకుంటామని, ఎన్నికలు ముగిసిన తర్వాత కేవలం అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెడుతూ పరిపాలన కొనసాగిస్తామన్నారు. నగర పంచాయతీలో ప్రధానంగా నీటి సమస్య, శానిటేషన్ వంటి పనులకు ప్రాధాన్యతను ఇస్తూ అజెండాను తయారు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వి.శ్రీనివాస రావు, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపిక, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రాం సేవలు చిరస్మరణీయం



పొదిలిలో నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



కొమరోలులో జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం గురుస్వామి

పొదిలి: బాబూ జగ్జీవన్ రాం భారత జాతికి అందించిన సేవలు చిరస్మరణీయమని మండల దళిత నాయకులు నివాళులర్పించారు. ఆయన వర్ధంతి పురస్కరించుకుని శనివారం స్థానిక ఏబీఎం పాఠశాల వద్ద ఉన్న అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర సమర యోధునిగా, కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. సురేష్ మాదిగ, ముక్కెర కిరణ్, పందింటి రవి, ఆదిమూలపు రవి, కరాటపు అశోక్ కుమార్, ఖయ్యూమ్, ఖుద్దూస్, బూదాల కమలాకర్, నెహేమియా, ఠాగూర్ నాగేశ్వరరావు, గాలిముట్టి నరసింహారావు, రవి, నాగులు, సామేల్, బెంజిమెన్, ఆనంద్, ఎలీషాబాబు, ఆంథోని, ఆరోను, ఐజాక్, పందు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కొమరోలు: జగ్జీవన్‌రామ్ నాయకత్వ లక్షణాలు, మంచితనాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అల్లినగరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి గురుస్వామి తెలిపారు. మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు దాసరి గురుస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమరయోధునిగా, ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా పని చేశారని తెలిపారు. పలు సామాజిక ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటాలు, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జనం కోసమే జీవించిన గొప్ప మహానుభావుడని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ వేస్తున్న పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి

కొనకనమిట్ల: జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల పశు వైద్యశాలల్లో కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్‌ను పశు వైద్యులు అమూల్య, రాజ్యలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి చేపట్టారు. 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ పిచ్చి కుక్క కరిచిన ఓ బాలుడికి మొదటి సారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారని తెలియజేశారు. ఆ ప్రయత్నం విజయవంతం కావటంతో అప్పటి నుంచి జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినత్సవంగా పాటిస్తున్నారన్నారు. పశు పోషకులు, పశు వైద్య వృత్తిలో ఉన్నవారు, పశువుల డెయిరీలో పని చేసే వారు, పాల ఉత్పత్తులు ఆహారంగా తీసుకునే వారు, కుక్కలు, పక్షులు పెంచుకునేవారికి వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. రేబిస్ ఒక ప్రాణాంతకమైన వ్యాధి అని హెచ్చరించారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు



మంచినీటి పైపులైన్‌ను ఏర్పాటును పరిశీలిస్తున్న అధికారులు

బేస్తవారిపేట:

ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు పక్కన మంచినీటి సరఫరా పైపులైన్‌లు లీకులతో నిత్యం నీరు వృథాగా పోతోంది. ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే మెయిన్ పైపులైన్ పగలడంతో కొన్ని నెలలుగా నీరు రోడ్డుపై పారుతోంది. డయోరియా ప్రబలుతుండటంతో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాయక్, పంచాయతీ కార్యదర్శి నరేంద్రలు పగిలిన పైపులైన్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. పగిలిన పైపును తొలగించి నూతన మంచినీటి పైపులైన్‌ను ఏర్పాటు చేశారు.

అంకాలమ్మా దీవించమ్మా!



అంకాలమ్మతల్లి మూలవిరాట్

కొనకనమిట్ల: కొనకనమిట్లలో పురాతన ఆలయం అంకాలేశ్వరి ఆలయంలో శనివారం భక్తులు దర్శించుకున్నారు. అంకాలమ్మ తల్లి ఉత్సవంను పురష్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని పునీతులయ్యారు.

వైభవంగా శ్రీవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం



శ్రీవారి కల్యాణ ఘట్టం

కొనకనమిట్ల: శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేడగపల్లిలో వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలుగా వేమిరెడ్డి నారాయణరెడ్డి, రాఘవమ్మ, బైసాని రాఘవేంద్రరావు, ధనలక్ష్మి, అక్షయ, శశికుమార్ దంపతులు వ్యవహరించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

నవోదయకు ఎంపీపీ స్కూల్ విద్యార్థి ఎంపిక

తర్లుపాడు: మండలంలోని కారుమానిపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థి కె. భవానీ శంకర్‌రెడ్డి కలుజువ్వలపాడు నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బత్తిన ప్రసాద్ శనివారం తెలిపారు. హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు దూదేకుల నబీ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కల్లం పుల్లారెడ్డి అభినందించారు.

మీకోసం కార్యక్రమం రేపు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జిల్లా వైద్యశాల వద్ద ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో సోమవారం ఉదయ, 10 గంటల నుంచి మీకోసం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని తహసీల్దార్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందచేసి పరిష్కరించుకోవాలని కోరారు. సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

కొమరోలు: 30 నెలల జీతాలు చెల్లిస్తారా ? ఉరి వేసుకోమంటారా? అంటూ పంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం నినాదాలు చేశారు. కొమరోలు పట్టణంలోని గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికుల జీతభత్యాలు 30 నెలలుగా గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి చెల్లించడం లేదంటూ 5 రోజులుగా గ్రామ సచివాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. 5 రోజులు అయినా తమ సమస్యలు పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో జీతాలు చెల్లిస్తారా ? ఉరి వేసుకోమంటారా ? అనే నినాదంతో సచివాలయ ప్రాంగణంలో కార్మికులు హోరెత్తించారు. సీపీఎం నాయకురాలు పోసాని అంజమ్మ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సేవా కార్యక్రమాలు చేయాలి

బేస్తవారిపేట: ఈ నెల 8న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సమాయత్తం కావాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ విగ్రహాలను శుభ్రపరచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలని పార్టీ శ్రేణులను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.